నాడు అపురూపం.. నేడు అదృశ్యం



ఆదరణ కోల్పోతున్న గ్రీటింగ్ కార్డులు

అంతా సోషల్ మీడియాలోనే..

గాజువాక : కొత్త సంవత్సరం వేళ అందరూ తమ బంధుమిత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటారు. క్రిస్మస్.. సంక్రాంతి.. జన్మదినం, వివాహ వార్షికోత్సవం, ప్రేమికుల రోజు, పండగలు.. వేడుక ఏదైనా ప్రేమగా శుభాకాంక్షలు తెలిపే సందర్భాలే. సందర్భం ఏదైనా అభిరుచికి తగ్గట్టుగా ఒక గ్రీటింగ్ కార్డును కొనుగోలు చేసి మనసులోని భావాలను కార్డుపై రాసి ఆత్మీయులకు పంపేవారు. కార్డును కవర్‌లో పెట్టి తాము ఇవ్వాలనుకున్న వ్యక్తిని వ్యక్తిగతంగా కలవడం.. లేదా మరో వ్యక్తితో పంపడం.. అదీ కుదరకపోతే పోస్టులో పంపడం.. దుకాణాల్లోని వందలాది గ్రీటింగ్ కార్డుల్లో ఆయా సందర్భాలకు తగిన కార్డును ఓపిగ్గా ఎంపిక చేసుకుని నచ్చిన వారికి పంపి, వారికి తమ భావాలను వ్యక్తపరిచేవారు. అయితే, ఇదంతా గతం.

నేటి ఇంటర్నెట్ యుగంలో సమాచార విప్లవం సమాజాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ప్రపంచమంతా ఒకే గ్రామంగా మారిపోయిన పరిస్థితుల్లో సమాచారంలో వేగం క్షణాలకు కుదించుకుపోయింది. ఈ విప్లవంలో పాత గ్రీటింగ్ కార్డులకు ఆదరణ దాదాపు తగ్గిపోతోంది. ఒకప్పుడు ఎవరైనా గ్రీటింగ్ కార్డు ఇస్తే దాన్ని భద్రంగా దాచుకునేవారు. వివిధ సందర్భాల్లో వాటిని చూసుకుని ఆనందం పొందేవారు. మొబైల్ ఫోన్ల రాకతో ప్రస్తుతం అవి కనుమరుగైన పరిస్థితులు వచ్చాయని చెప్పవచ్చు.



సెల్‌ఫోన్ మెసేజ్‌లతో తగ్గిన ప్రభావం

ఇరవై ఏళ్ల క్రితం వరకు గ్రీటింగ్ కార్డుల వినియోగం గట్టిగా నడిచింది. సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటి వినియోగం తగ్గుతూ వచ్చింది. సెల్‌ఫోన్ల మెసేజ్‌లు గ్రీటింగ్ కార్డుల స్థానాన్ని తగ్గిస్తూ వచ్చాయి. తర్వాత కాలంలో ఈ మెయిల్ ద్వారా గ్రీటింగ్ కార్డులను పంపేవారు. ఆ తర్వాతి కాలంలో స్మార్ట్ ఫోన్‌లు వచ్చాయి. 3జీ, 4జీ, ప్రస్తుతం 5జీ విప్లవంతో గ్రీటింగ్ కార్డుల ప్రభావం చాలా వరకు తగ్గిపోయింది. ప్రస్తుతం సోషల్ మీడియా ద్వారా గ్రీటింగ్స్ చెప్పుకునే పరిస్థితి వచ్చింది. వాట్సాప్, ఫేస్‌బుక్, టెలిగ్రాం, హైక్, మెసెంజర్, ట్విట్టర్, ఎక్స్ వంటి అనేక ప్లాట్‌ఫారాల ద్వారా గ్రీటింగ్స్ చెప్పుకుంటున్నారు. అలాగే ఎన్నో రకాల యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎవరికి గ్రీటింగ్ కార్డు ఇస్తున్నామో, సందర్భం ఏమిటి అనే విషయాల ప్రాతిపదికగా నచ్చిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని వాటిపై తమ భావాన్ని రాసి పంపుతున్నారు. అయితే నేటి యువత డిజిటల్ కమ్యూనికేషన్‌కు అలవాటు పడినా నేటికీ గ్రీటింగ్ కార్డుల ద్వారా సందేశాలు పంపే పాతతరం ఇంకా మిగిలే ఉంది.

ఇదీ గ్రీటింగ్ కార్డు చరిత్ర



గ్రీటింగ్ కార్డు తొలి జన్మస్థలం చైనా. అప్పట్లో రంగు వస్త్రాలపై వాటిని రూపొందించేవారు. తర్వాత కొంత కాలనికి ఇవి ప్రాచీన ఈజిప్టులోను మొదలయ్యాయి. 15వ శతాబ్దం నాటికి జర్మనీలో కాగితంపై ఇవి ముద్రించటం మొదలైంది. జర్మన్‌లు మొదట చెక్కతో తయారు చేసిన గ్రీటింగ్‌లను ఉపయోగించేవారు. యూరోపియన్లు చేతితో తయారు చేసిన గ్రీటింగ్‌లను ఉపయోగించేవారు. అప్పటి నుంచి గ్రీటింగ్ కార్డుల సంస్కృతి మొదలైంది. శతాబ్దాల పాటు ఈ సంస్కృతి కొనసాగింది. 1800 సంవత్సరం వచ్చేసరికి యూరప్ దేశాల్లో టెక్నాలజీ మరింత పెరిగి కొత్త ఏడాది వేళ వేలాది గ్రీటింగ్ కార్డుల ముద్రణ మొదలైంది. తొలి క్రిస్మస్ గ్రీటింగ్ కార్డు 1843లో ఇంగ్లాండ్‌లో రూపొందించారని చరిత్ర చెబుతోంది. ఈ కార్డులకు సౌత్ అమెరికాలో మంచి గుర్తింపు రావడంతో 20వ శాతాబ్దం వచ్చేసరికి మిలియన్ల కొద్దీ గ్రీటింగ్ కార్డుల తయారీ, అమ్మకాలు అందుబాటులోకి వచ్చాయి. గ్రీటింగ్ సంస్కృతి మొదలైన తొలి కాలంలో కార్డులను నేరుగా అందించేవారు. ఇలా చేయడం ద్వారా ఎదుటి వారిపై తమకున్న ఆప్యాయత, అభిమానం తెలియజేసేవారు.

సందడే సందడి

ఒకప్పుడు కేవలం కొత్త సంవత్సరం, క్రిస్మస్‌లకే పరిమితమైన గ్రీటింగ్ కార్డులు తర్వాత పుట్టినరోజు, పెళ్లిరోజు, అభినందనలు తెలపాల్సి వచ్చినప్పుడు ఉపయోగించడం పెరిగింది. పోస్టుకార్డు సైజ్‌లో గ్రీటింగ్ కార్డులు, మ్యూజిక్ గ్రీటింగ్ కార్డులు, సినిమా హీరోలు, హీరోయిన్లు, దేవుళ్లు, సీనరీస్‌తో ఉన్న కార్డులు మార్కెట్‌లో లభ్యమయ్యేవి.

గొప్ప అనుభూతిని కోల్పోతున్నాం..

గతంలో నూతన సంవత్సరం గాని, క్రిస్మస్ గాని వస్తే స్నేహితులందరం కలిసేవారం. ఎంతో ఆనందంగా ఉండేది. ఒకరికొకరు గ్రీటింగ్ కార్డులను ఇచ్చుకుని శుభాకాంక్షలు చెప్పుకొనేవాళ్లం. సమాచార వ్యవస్థ కొత్త పుంతలు తొక్కడం ఆనందమే అయినప్పటికీ చిన్న చిన్న ఆనందాలకు దూరమవుతున్నామనే బాధ కూడా కలుగుతోంది.

– బంగార్రాజు, గాజువాక

టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి..

ఇది డిజిటల్ యుగం. ఏమాత్రం ఖర్చు లేకుండా క్షణాల్లో శుభాకాంక్షలు చెప్పుకోవచ్చు. గ్రీటింగ్ కార్డులు కొనుగోలు చేసి వాటిని స్వయంగా తీసుకెళ్లి ఇచ్చే సమయం ఎవరికీ లేదు. మా స్నేహితులు చాలా మంది ఎక్కడెక్కడో ఉన్నారు. వారందరికీ గ్రీటింగ్ కార్డులు ఇవ్వడం సాధ్యం కాదు. అందుకే సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు చెప్పుకుంటున్నాం.

– ఎం.మణికంఠ, గాజువాక

క్లుప్తంగా

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించండి



సమావేశంలో మాట్లాడుతున్న కసిరెడ్డి సత్యనారాయణ

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ఉద్యోగులకు, ఒప్పంద కార్మికులకు మూడు నెలలుగా బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ కోరారు. ఈ మేరకు పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతాలు సకాలంలో చెల్లించకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు యాజమాన్యం స్పందించి జీతాలు చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఆనంద్, అచ్యుతరావు, పోలయ్య, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



ట్రైవీల్ సైకిల్ అందజేస్తున్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి నూరవ జయంతి సందర్భంగా సత్యసాయి సమితి దత్తత గ్రామం నమ్మిదొడ్డిలో అంగవైకల్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తికి బ్యాటరీతో నడిచే ట్రైసైకిల్ అందజేశారు. గ్రామంలో నిర్వహించిన పల్లకీ సేవలో గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 100 మందికి నారాయణ సేవ (భోజనం) అందించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, జిల్లా మహిళా సేవా విభాగం సమన్వయకర్త ఈశ్వరి, పురుషుల సేవా విభాగం సమన్వయకర్త ఆర్.ఎ. నాయుడు, జిల్లా మహిళా యువత సమన్వయకర్త సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ జాతీయ పోటీలకు కణితి విద్యార్థులు



జాతీయ పోటీలకు బయల్దేరిన కణితి హైస్కూల్ విద్యార్థులతో కోచ్ నారాయణ

అగనంపూడి: ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కోర్బాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు మంగళవారం బయల్దేరారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్–14 బాలికల పోటీలకు 9వ తరగతి విద్యార్థులు హేమ దుర్గ, హారిక, దేవి, అండర్–14 బాలుర జట్టుకు యశ్వంత్, గీతా గౌతమ్, అండర్–19 బాలికల పోటీలకు కల్యాణి ఎంపికయ్యారు. నెల రోజుల క్రితం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు గెలుపొందడంతో జాతీయ స్థాయి పోటీలకు తరలివెళ్లారు. కోచ్ నారాయణ, మేనేజర్ వి.దేముడుబాబు సారథ్యంలో రాష్ట్ర జట్టు విశాఖ నుంచి బయల్దేరినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.మన్నాజీ తెలిపారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ విద్య: కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల పోస్టర్లను ఎన్‌ఏడీలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు మంగళవారం ఆవిష్కరించారు.

రెవెన్యూ సదస్సులతో భూ వివాదాలు పరిష్కారం



గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఎస్‌వో మధుసూదన్‌కు వినతిపత్రాలు అందిస్తున్న స్థానికులు

అగనంపూడి: ఏపీ రీఫ్రాక్టరీస్ సంస్థ కోసం స్థలాలు ఇచ్చిన నిర్వాసితులు దగాపడ్డారని, వారి భూములు వారికి తిరిగి ఇచ్చేయాలని అధికారులను బాధిత రైతులు కోరారు. గాజువాక మండలం తలారివానిపాలెం గ్రామ రెవెన్యూ సదస్సు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ ఏపీ రీఫ్రాక్టరీస్ ఏర్పాటు చేస్తే ఉపాధి దొరుకుతుందనే ఆశతో కారుచౌకగా భూములు అందించామని, అయితే రీఫ్రాక్టరీస్ సంస్థ ఏర్పాటు చేసిన ఏడాదిన్నరలోనే మూసేసి, ఆస్తుల్ని బ్యాంక్‌లకు తాకట్టు పెట్టి పరారయ్యారని విన్నవించారు. సదరు భూములను వెనక్కి ఇచ్చేయాలని కోరారు. గాజువాక తహసీల్దార్ తోట శ్రీవల్లి, ప్రత్యేకాధికారి మధుసూదన్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో భూముల ధరలు రెట్టింపు కావడంతో భూవివాదాలు తలెత్తుతున్నాయని, వీటిని పరిష్కరించేందుకే ఈ సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూములు ఆక్రమించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, నాయకులు దొళేంద్ర, ఎన్.సూర్యనారాయణ, బి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, కె.తాతారావు, మనోహర్, బి.అప్పారావు, ఎస్.అప్పారావు, చందు పాల్గొన్నారు.

లోకం మెచ్చిన గణిత శాస్త్రవేత్త రామానుజన్



విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

అగనంపూడి: గణితశాస్త్రం ద్వారా భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచ నలుదిశలా చాటిచెప్పిన లోకం మెచ్చిన గణిత శాస్త్రవేత్త రామానుజన్ అని రామకృష్ణ పాఠశాల డైరెక్టర్ పొన్నాడ వాసుదేవరావు, ప్రిన్సిపాల్ లలిత కుమారి అన్నారు. 86వ వార్డు కూర్మన్నపాలెంలోని రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి వారు మాట్లాడుతూ గణిత సూత్రాలు అర్థం చేసుకుంటే గణితం అంత సులభమైన సబ్జెక్టు మరొకటి ఉండదన్నారు. సూత్రాలపై పట్టు సాధిస్తే శతశాతం మార్కులు సాధించే అవకాశం చాలా ఎక్కువగా ఉన్నది గణితం మాత్రమేనన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను సహచర విద్యార్థులు, తల్లిదండ్రులు తిలకించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది జాన్, రామకృష్ణ, అన్నపూర్ణ, పుష్ప, మంజు, ధాత్రి, గీత తదితరులు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్ సమస్యపై వినతి



విశాఖ ఎంపి భరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్లు

ఉక్కునగరం: పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ మంజూరు అంశంలో జరుగుతున్న జాప్యంపై స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు విన్నవించారు. ఈ మేరకు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇచ్చిన డిమాండ్ నోటీసులకు స్పందించి సుమారు రూ. 400 కోట్లు ఈపీఎఫ్‌ఓకు చెల్లించారన్నారు. అయినప్పటికి రీజనల్ ప్రావిడెంట్ కమిషనర్ ఇప్పటి వరకు హయ్యర్ పెన్షన్ చెల్లింపుపై ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీనిపై ఎంపీ స్పందిస్తూ ఈ విషయాన్ని ఇప్పటికే కార్మిక మంత్రి దృష్టికి తీసుకు వెళ్లానని, మరోసారి కలుస్తానని తెలిపారు. అదే విధంగా ఉక్కు యాజమాన్యం ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ పెన్షన్లు సక్రమంగా చెల్లించలేదని ఎంపీ దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో ఉక్కు అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, పెన్షనర్లు వాసా మూర్తి, దశరథ్, రంగనాథ్, ద్వారం స్వామి తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టులో రైల్వే క్రూ లాబీ ప్రారంభం



అదానీ గంగవరం పోర్టులో ఆధునిక క్రూ మేనేజ్‌మెంట్ విభాగం ప్రారంభోత్సవంలో రైల్వే డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు, పోర్టు సీఈవో తదితరులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టులోని ఆర్‌అండ్‌డీ యార్డ్‌లో ఆధునిక క్రూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్) సదుపాయంతో కొత్త రైల్వే క్రూ లాబీని ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు మంగళవారం ప్రారంభించారు. ఈ అత్యాధునిక లాబీలో ప్రత్యేక క్రూ కంట్రోలర్ ఆఫీస్, రైల్వే ఉద్యోగుల సౌకర్యం కోసం విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. కార్గో హ్యాండ్లింగ్, స్టోరేజ్, డిస్పాచ్ కార్యకలాపాల కోసం దీనిని ఏర్పాటు చేశారు. పోర్టు రశీదు, డిస్పాచ్ యార్డ్ నుంచి లోడు చేసిన తర్వాత రైళ్లను నేరుగా తీసుకోవడంతోపాటు సమయం ఆదా అవుతుంది. ఈ సందర్భంగా గంగవరం పోర్టు యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ రైల్వే క్రూ లాబీ ప్రారంభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. రైల్వే సిబ్బంది శ్రేయస్సు కోసం దీనిని ఏర్పాటు చేశామన్నారు.

యాదవులను ఆదుకోవాలి

అగనంపూడి: అద్దంకి నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ప్రైవేటు ట్రావెల్ బస్ గొర్రెల మందపైకి దూసుకుపోయిన ఘటనలో 182 గొర్రెలు మృతి చెందగా, మరో 50 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయని, ఆ యజమానిని ఆదుకోవాలని రాష్ట్ర యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, ప్రతినిధులు ఒడ్డు పైడిరాజు, మాడిశ వెంకటరావు ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ నారాయణపేట జిల్లా కొంపల్లికి చెందిన గొర్రెల కాపరులు లేయప్ప, కరెప్ప, మల్లేశులు కూడా తీవ్రంగా గాయపడ్డారని, సుమారు రూ. 36 లక్షల విలువైన గొర్రెలు బలయ్యాయని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని వారు కోరారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మేరీమాత, శాంతాక్లాజ్ వేషధారణలో అలరించిన చిన్నారులు



సియోను ప్రార్థనా మందిరంలో ఆకర్షిస్తున్న క్రీస్తు జననం సెట్



ముస్తాబైన సియోను ప్రార్థనా మందిరం

గాజువాక: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్ పండగ కళ పట్టణంలో ఉట్టిపడుతోంది. క్రిస్మస్ వేడుకలకు గాజువాకలోని చర్చిలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుద్దీపాలు, క్రిస్మస్ ట్రీ, శాంతాక్లాజ్ బొమ్మలు, పశువుల పాక (క్రిబ్)ల అలంకరణతో కళకళలాడుతున్నాయి. పాతగాజువాకలోని రోమన్ కేథలిక్ చర్చి, శ్రీనగర్‌లోని మన్నా, సీఎల్‌సీ యునైటెడ్ బాప్టిస్ట్, బీసీరోడ్డు రైతుబజార్ సమీపంలోని యునైటెడ్ బాప్టిస్ట్, యూసీఎం, వుడా రోడ్డులోని యెహోవా షమ్మా, సియోను ప్రార్థనా మందిరం క్రిస్మస్‌కు ముస్తాబయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలుచోట్ల ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. క్రీస్తు స్తోత్రాలు, ఆరాధనలు నిర్వహించారు. ప్రభు ఏసుక్రీస్తును స్తుతించారు. క్రీస్తు జన్మ వృత్తాంతాలను ఏర్పాటు చేశారు. క్రిస్మస్ సందర్భంగా బుధవారం తెల్లవారుజామునుంచి ప్రత్యేక ప్రార్థనలు, సువార్త కూటములు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు..

అగనంపూడి: క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పలు పాఠశాలల్లో విద్యార్థులు మేరీమాత, శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో అలరించారు. 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు మేరీమాత, శాంతాక్లాజ్ అలంకరణలో జీసస్‌ను కీర్తిస్తూ పాటలు పాడుతూ నృత్యం చేశారు. ఏసుక్రీస్తు జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించి అలరింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు ఎం.పి.కొండయ్య, ప్రిన్సిపాల్ యు.పద్మజ, డైరెక్టర్ దీపక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. 87వ వార్డు కణితి కాళింగ వీధిలోని డాలీ ప్లే స్కూల్ ఆవరణలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శాంతాక్లాజ్ తాతల రూపంలో ఆకట్టుకున్నారు. గేయాలు పాడుతూ నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధురి, వైస్ ప్రిన్సిపాల్ శిరీష, సుధ పాల్గొన్నారు.

అలరించిన నాటిక..

ఉక్కునగరం: స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో మంగళవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జీసస్ క్రైస్ట్ జననం గురించి నాటిక ప్రదర్శించారు. క్రిస్మస్ విశిష్టతను శాంతాక్లాజ్ తెలిపేలా జరిగిన ప్రదర్శన ఆకట్టుకుంది. 500 మందికి పైగా విద్యార్థులు జీసస్ క్రైస్ట్‌పై గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పి. సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేఘనా కంభం క్రిస్మస్ విశిష్టతను వివరించి విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.

చర్చిలకు ముస్తాబు..


పెదగంట్యాడ: మండలంలోని గంగవరం రోడ్డులో గల సియోను ప్రార్థనా మందిరాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ప్రార్థనా మందిరం వద్ద ఏర్పాటు చేసిన క్రీస్తు జననం సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జియోన్ పీస్ ఫెలోషిప్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాస్టర్ కేత అప్పారావు, కార్యదర్శి కేత సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. వుడా కాలనీలోని లివింగ్ క్రైస్ట్ చర్చిలో క్రిస్మస్ సంబరాలకు సర్వం సిద్ధం చేశారు. చర్చి పాస్టర్లు సామ్‌సన్, ఆరోన్‌జాన్ సుజిత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నారు.

ముస్తాబైన యునైటెడ్ ఇమ్మానుయేల్ చర్చి..

అక్కిరెడ్డిపాలెం: క్రిస్మస్‌ను పురస్కరించుకుని 68వ వార్డు రాంనగర్‌లోని యునైటెడ్ ఇమ్మాన్యూయేల్ చర్చి ముస్తాబైంది. బుధవారం క్రిస్మస్ పురస్కరించుకుని ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు చర్చి ప్రతినిధులు తెలిపారు.



వుడా కాలనీలోని లివింగ్ క్రైస్ట్ చర్చి



విద్యుత్ కాంతులీనుతున్న సీఎల్‌సీ చర్చి



ముస్తాబైన రాంనగర్‌లోని యునైటెడ్ ఇమ్మానుయేల్ చర్చి



ధవళ కాంతులీనుతున్న మన్నా చర్చి



సుందరంగా ముస్తాబైన యూబీ చర్చి

'విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ పరం చేయొద్దు'



ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గాజువాక: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తోందని ఆరోపిస్తూ సీపీఎం నాయకులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చినగంట్యాడలోని 100 అడుగుల రోడ్‌లో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ ఛండీగఢ్‌లోని డిస్కంను ప్రైవేట్ విద్యుత్ కంపెనీకి అమ్మడానికి ఈ నెల 4న ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్‌ను జారీ చేసిందన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నూకేశ్వరరావు, గొలగాని అప్పారావు, కిరీటం, పి.వై.వి.రమణారావు, సుభద్రాదేవి, సంతోషం, సుబ్బన్న, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.